క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు



మాట్లాడుతున్న జోన్-5 కమిషనర్ రాము

సీతంపేట: ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలందించాలని జీవీఎంసీ జోన్-5 కమిషనర్ బి.రాము అన్నారు. అక్కయ్యపాలెం షాదీఖానాలో పారిశుధ్యంపై జోన్ స్థాయిలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జోన్-5 పరిధిలోని 24 వార్డుల్లో ప్రతి ఇంటికి క్లాప్ వాహనాలతో చెత్త సేకరణ జరగాలన్నారు. కార్మికుల హాజరు, విధులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏఎంవోహెచ్ పర్యవేక్షించాలని ఆదేశించారు. కాలువలు, గెడ్డలు, ఎక్కడ పడితే అక్కడ చెత్త పడవేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుధ్య సిబ్బంది విధుల్లో అలసత్వం వహించకుండా చూడాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్‌ను ఆదేశించారు. సమావేశంలో శానిటరీ సూపర్‌వైజర్ జనార్దన్, 24 వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారులు



సంప్రదాయ వేషధారణల్లో విద్యార్థులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ స్కూల్‌లో బాలల దినోత్సవ కార్యక్రమాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన చిన్నారులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఐ.భాస్కర రావు, సునీత బహుమతులు అందజేశారు. ప్రైమరీ స్కూల్ చిన్నారులు పలు దేశభక్తి గీతాలను ఆలపించారు. సంప్రదాయ వస్త్రాలు ధరించి సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ప్రిన్సిపాల్ భాస్కరరావు మాట్లాడుతూ బాలల దినోత్సవ ప్రాముఖ్యత, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జీవితం గురించి విద్యార్థులకు వివరించారు.

సూపర్‌స్టార్ కృష్ణకు సేవా నివాళి



షిర్డీసాయి ధ్యాన మందిరంలో అన్నదానం చేస్తున్న నందకిషోర్, కమల్‌కుమార్

తాటిచెట్లపాలెం: 'తెలుగు చలనచిత్ర సీమలో అనేక రికార్డులు సృష్టించిన గొప్ప నటుడు సూపర్‌స్టార్ కృష్ణ' అని ఆయన అభిమాని కమల్‌కుమార్ కొనియాడారు. కృష్ణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కమల్‌కుమార్ ఆధ్వర్యంలో రైల్వే న్యూకాలనీ షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ఘనంగా నివాళులర్పించా రు. పేదలు, యాచకులు, భక్తులకు అన్నదానం చేశారు. శ్రేయ ప్రాపర్టీస్ అధినేత ఎం.నందకిషోర్, ఎం.శ్రీధర్‌ల చేతుల మీదుగా అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమల్‌కుమార్‌ను ధ్యాన మందిర నిర్వాహకులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ బాబు అభిమానులు పాల్గొన్నారు.

సముద్ర గస్తీపై శిక్షణ



మొజాంబికన్ ఆర్మ్‌డ్ ఫోర్స్‌కు శిక్షణ ఇస్తున్న ఐఎన్ఎస్ ఘరియాల్ అధికారి

ఎంవీపీకాలనీ: సముద్ర భద్రత కోసం ఐక్య ఫ్రంట్‌లో భాగంగా ఐఎన్ఎస్ ఘరియాల్ అధికారులు మొజాంబికన్ ఆర్మ్‌డ్ ఫోర్స్‌కు ఉమ్మడి గస్తీపై శిక్షణ ఇచ్చారు. మొజాంబిక్‌లోని పోర్ట్ నకాలా నుంచి ఈ నెల 12న ఐఎన్ఎస్ ఘరియాల్ బయలు దేరిన సమయంలో ఈ శిక్షణ జరిగింది. జాయింట్ ఈఈజెడ్ గస్తీ, సముద్ర రైడర్లకు ఎన్‌బీసీడీ, వీబీఎస్ఎస్, ఇంజిన్ అండ్ స్విచ్‌బోర్డ్ నియంత్రణలపైనా మొజాంబికన్ దళాలకు శిక్షణ అందించారు.

జరిమానాలపైనే ఫోకస్..!

- ఫొటోగ్రాఫర్ల అవతారమెత్తిన ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు
- హెల్మెట్ లేకుంటే ఎడాపెడా ఫొటోలు
- అసలు విధులు గాలికి.. అస్తవ్యస్తంగా ట్రాఫిక్
- ద్విచక్ర వాహన చోదకుల ఆందోళన



కేసులు రాస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)



ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద అస్తవ్యస్తంగా ట్రాఫిక్

మద్దిపాలెం: హెల్మెట్ ధరించ లేదా.. కుటుంబ శ్రేయస్సు దృష్ట్యా ధరించండి.. అంటూ వాహన చోదకుల చేతిలో గులాబీ పువ్వు పెట్టి చెప్పేవారు. ఇదంతా గతం. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. దీంతో ట్రాఫిక్ పోలీసుల తీరు కూడా మారిపోయింది. ప్రయాణంలో హెల్మెట్ లేకుంటే చాలు రద్దీ రోడ్ల మీద కూడా అడ్డంగా వచ్చి ట్రాఫిక్ కానిస్టేబుళ్ల ఫొటోలు తీయడం ఫ్యాషనై పోయిందని ద్విచక్ర వాహన చోదకులు మండిపడుతున్నారు. చిన్న, చిన్న పనుల మీద స్వల్ప దూరాలకు బయటకొచ్చినప్పుడు హెల్మెట్ తప్పనిసరి అంటే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు కొద్ది నెలలుగా ఫొటోగ్రాఫర్ అవతారమెత్తి అసలు విధులు పక్కన పెట్టేస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కన్నా జరిమానాలు విధించడంపైనే ఎక్కువగా దృష్టి పెట్టారని పలువురు వాహన చోదకులు ఆరోపిస్తున్నారు.

హెల్మెట్ కేసులే టార్గెట్

ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో అటు జాతీయ రహదారి ఆర్ అండ్ బీ, బిర్లా, ఊర్వశి, తాటిచెట్లపాలెం, ఇటు బీఆర్‌టీఎస్ రహదారిలో మద్దిపాలెం, 104 ఏరియా, కంచరపాలెం మెట్టు, జ్ఞానాపురం వంటి జంక్షన్ల వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంటుంది. ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఉన్నాయి. ఈ పీఎస్ పరిధిలో తరచూ చిన్నా, పెద్దా రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇటువంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణను మర్చిపోయి హెల్మెట్ కేసులు నమోదు చేయడమే ధ్యేయంగా పనిచేయడం తీవ్ర దుమారం రేపుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. ఎవరికి నచ్చినట్టు వారు వాహనాలపై ప్రయాణిస్తున్నారు. పలువురు వాహన చోదకులు అత్యవసర పనుల మీద వెళ్లేటపుడు కూడా ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ లేదంటూ వాహనం ఆపి ఫొటోలు తీయడం, కేసులు రాయడం సర్వసాధారణమైంది. ఎడాపెడా ఫొటోలు తీస్తున్నా ట్రాఫిక్ పోలీసులు.. అసలు విధులను పక్కన పెట్టేస్తున్నారని ద్విచక్ర వాహన చోదకులు విమర్శిస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వాహనాలు, తోపుడు బండ్లను తొలగించడం, అడ్డదిడ్డంగా వాహనాలు పార్క్‌చేస్తున్న వారిని వారించడం మానేసి కేవలం ఆయా జంక్షన్లలో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహన చోదకులను ఆపి ఫొటోలు తీయడమే పనిగా పెట్టుకోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి అవసరం

ట్రాఫిక్ విభాగం అధికారులు కూడా ప్రభుత్వానికి జరిమానాల ఆదాయం పెంచడమే ధ్యేయంగా పెట్టుకున్నారో ఏమోగాని.. కానిస్టేబుళ్లు మాత్రం మొబైల్ ఫోన్లకు పనిచెబుతూనే ఉంటున్నారు. జాతీయ రహదారి మీద సుదూర ప్రయాణాలు చేసే వారు హెల్మెట్ ఎలాగూ ధరిస్తారు. ఇంటి నుంచి స్వల్ప దూరంలోనే ఉన్న దుకాణాలు, ఆస్పత్రులకు వెళ్లేటప్పుడు కూడా హెల్మెట్లు లేవంటూ ఫొటోలు తీసి వేధిస్తున్నారని పలువురు వాహన చోదకులు వాపోతున్నారు. పైగా ఈ కేసులు నమోదైతే మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడంతో వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. రోడ్డు మీద ఉన్న గోతులను పూడ్చకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదని, హెల్మెట్ ధరించడం లేదని వేధించడం ఎంతవరకు సబబని పలువురు ప్రశ్నిస్తున్నారు. ద్విచక్ర వాహన చోదకులను ఇబ్బంది పెట్టడం మానేసి.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారించాలని ఐదో పట్టణ పోలీసులకు సూచిస్తున్నారు.

ప్రైవేటీకరణ టెండర్లు రద్దు చేయాలి



పోర్టు హాస్పిటల్ పరిరక్షణ దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆస్పత్రి ఎదురుగా సీఐటీయూ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు 46వ రోజుకు చేరాయి. సీఐటీయూ-పోర్ట్ వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం దీక్షలో పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు జక్కన సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ నిర్ణయం పూర్తిగా ఉద్యోగుల హక్కులు, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతను క్షీణింపచేసేదిగా ఉందని విమర్శించారు. ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. అన్ని యూనియన్లు దీనిని తీవ్రంగా వ్యతిరేకించడంతో టెండర్ల ప్రక్రియను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేశారని, పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పోర్టు సొంత నిధులతోనే ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని, వైద్య సిబ్బందిని, పరికరాలను సమకూర్చి హాస్పిటల్ సేవలను కొనసాగించాలని కోరారు. 'మెరుగైన వైద్యం అందించడం యాజమాన్యం బాధ్యత-పొందడం కార్మికులు, ఉద్యోగుల హక్కు' అని సిటూ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.జగన్, కె.సత్యనారాయణ, రెడ్డి, ఆర్ఎన్ మూర్తి, రాఘవులు, శ్రీనివాస్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



కైలాసపురంలో పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డులో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అధికారులను ఆదేశించారు. వార్డు పరిధిలో పలు ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. తాటిచెట్లపాలెం జాతీయ రహదారి నుంచి కైలాసపురం కొండవాలు ప్రాంతానికి వెళ్లే రహదారిలో జరుగుతున్న గెడ్డ నిర్మాణ పనులు, డ్రైనేజీల నిర్మాణం, రిటైనింగ్ వాల్ పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కై లాసపురం-తాటిచెట్లపాలెం పరిధిలో 80శాతం అభివృద్ధి పనులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ఇంజినీరింగ్ ఏఈ వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎ.నరేష్‌స్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గురునానక్ జయంతి



గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న సిక్కులు



ప్రార్థనల్లో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్

సీతమ్మధార: సిక్కుల మొదటి గురువు గురునానక్ జయంతి సందర్భంగా గురుద్వారాలోని గురుద్వారా సత్సంగ్ మందిరంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.15 వరకు కీర్తనలు ఆలపించారు. గురుద్వారా సద్ సంగత్ అధ్యక్షుడు డి.ఎస్. ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ ఎంపీ శ్రీభరత్ హాజరై, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురు గ్రంథ్ సాహిబ్ జీని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సిక్కులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన



ప్రదర్శనలో పుస్తకాలు తిలకిస్తున్న విద్యార్థులు

మురళీనగర్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మురళీనగర్‌లోని మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఉదయం పుస్తక ప్రదర్శనను కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ అధినేత కృష్ణంరాజు ప్రారంభించారు. పుస్తక ప్రదర్శనకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. విద్యార్థులు తమకు ఇష్టమైన పుస్తకాలను తీసుకుని పఠించారు. అనంతరం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, బాలభాను, గాయత్రి విద్యా మందిర్ విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్ విభాగంలో గ్రంథాలయ ఉద్యమకారులు, నేతల చిత్రపటాలు, జూనియర్ విభాగంలో దేశ నాయకుల చిత్రపటాలపై చిత్రలేఖన పోటీలు జరిగాయి. లైబ్రేరియన్ వై .పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నేవీ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగి శ్రీనివాసరావు, కోటి తరుణ్, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



డ్రా తీసిన స్టాల్ నంబర్ టోకెన్ ఇస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో శుక్రవారం 63 రైతుల స్టాల్స్‌కు డ్రా తీశారు. ఉదయం రైతుల కార్డులు 87 రాగా, 63 స్టాల్స్‌కు డ్రా తీశారు. సాయంత్రం 63 స్టాల్స్‌కు 70 కార్డులు వచ్చినట్లు ఈవో కొండబాబు తెలిపారు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు డ్రా తీసి, ఆ టోకెన్లను రైతులకు అందజేశారు. ఈవో కొండబాబు మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రైతుల స్టాల్స్‌కు సంబంధించి డ్రా తీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాహిత్య క్విజ్ పోటీ



క్విజ్ పోటీలో పాల్గొన్న సాహితీవేత్తలు

సీతంపేట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం సాహిత్య క్విజ్ పోటీ నిర్వహించారు. తెలుగు కళారంగం పేరిట చలనచిత్రం, నాటకం, సంగీతం, నృత్యం అంశాలపై క్విజ్ జరిగింది. విశాఖ సాహితి అధ్యక్షురాలు కందాళ కనకమహాలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ పోటీలో పలువురు సాహితీవేత్తలు, రచయితలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పౌర గ్రంథాలయం సంయుక్త కార్యదర్శి డి.వి.సూరాయరావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. 70 మంది పాల్గొనగా.. ఎనిమిది రౌండ్లలో రౌండ్‌కు 8 ప్రశ్నలు సంధించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. శనివారం సాయంత్రం విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో కవితా గోష్ఠి జరుగుతుందని లైబ్రేరియన్ దుర్గారాణి తెలిపారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార: విద్యార్థులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ, భాస్కరరావు సూచించారు. సీతమ్మధారలోని నవోదయ జూనియర్ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని.. ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్ ప్రయాణం చేయవద్దని హితవు పలికారు. వాహనాలు నడిపేవారంతా మొబైల్ ఫోన్లలో మాట్లాడరాదని స్పష్టం చేశారు. రోడ్డు దాటే పాదచారులు మొబైల్‌ఫోన్లలో మాట్లాడడం ప్రమాదకరమని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు చాలామంది ఆర్టీసీ సిటీబస్ ఫుట్‌బోర్డుల మీద వేలాడుతూ ప్రమాదభరితంగా ప్రయాణిస్తున్నారని, ఇది ప్రమాదకరమని తెలిపారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిష్ఠించాలని ఆకాంక్షించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్తీక కాంతులు

ఆలయాలు కార్తీక కాంతులతో కళకళలాడాయి. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వేకువజామున పరమేశ్వరుడికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణాల్లో సాయంత్రం జ్వాలాతోరణాలు వెలిగించారు.

- వైభవంగా కార్తీక పౌర్ణమి
- భక్తులతో కళకళలాడిన శివాలయాలు
- కనుల పండువగా జ్వాలాతోరణ మహోత్సవం



నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో విద్యుద్దీపాలంకరణ



శంకరమఠం రోడ్‌లో రామలింగేశ్వర ఆలయం వద్ద జ్వాలా తోరణ మహోత్సవం

సీతంపేట: శివాలయాలన్నీ పౌర్ణమి శోభతో కళకళలాడాయి. కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. సీతంపేటలోని పార్వతీశ్వరాలయం, రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ అర్చకులు ఉదయాన్నే శివునికి జలాభిషేకం, అనంతరం పంచామృతాభిషేకం చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలను దర్శించి అర్చనలు, అభిషేకాలు, క్షీరాభిషేకాలు జరిపించారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం, ఉసిరి, జమ్మి, మారేడు, నేరేడు చెట్లకు పూజలు చేసి దీపాలు వెలిగించారు. ఆలయ ఈవో జి.వి.రమాభాయి, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దేదీప్యమానం.. జ్వాలాతోరణం

సీతంపేట పార్వతీశ్వరాలయం వద్ద శుక్రవారం రాత్రి జ్వాలాతోరణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. జ్వాల వెలుగుతుండగా స్వామి వారి పల్లకిని మూడు సార్లు తోరణం దాటించారు. హర హర శంభోశంకర అంటూ భక్తులు పెద్ద సంఖ్యలో పల్లకీ వెంట జ్వాలాతోరణం మూడు సార్లు దాటారు. ముందుగా పార్వతీశ్వరుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శివాజీశర్మ, భాస్కరశర్మ పార్వతీశ్వరునికి మేళతాళాలతో రుద్ర హారతులిచ్చారు.

రామలింగేశ్వరాలయంలో..

శంకరమఠం రోడ్‌లోని రామలింగేశ్వరాలయం వద్ద శుక్రవారం రాత్రి జ్వాలా తోరణ మహోత్సవం నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో రామలింగేశ్వరుని ఉత్సవ విగ్రహానికి తిరువీధి మహోత్సవం నిర్వహించారు. అనంతరం జ్వాలా తోరణం వెలిగించారు. భక్తులు పల్లకీ వెంట మూడు సార్లు తోరణం దాటారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయం వద్దకు చేరుకోవడంతో కోలాహలం నెలకొంది. ఆలయ ఈవో జి.వి. రమాభాయి, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పార్వతీశ్వరాలయంలో అభిషేకంలో పాల్గొన్న భక్తులు



సీతంపేట పార్వతీశ్వరాలయం వద్ద జ్వాలాతోరణం ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



కార్తీక దీపారాధన చేస్తున్న భక్తులు



అర్ధ నారీశ్వరుడిగా ఉమారామలింగేశ్వరుడి



పార్వతీశ్వరునికి జలాభిషేకం చేస్తున్న అర్చకుడు



ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



14వ వార్డు గణేష్‌నగర్‌లో జ్వాలాతోరణం

ఉమానీలకంఠేశ్వరాలయంలో..

సీతమ్మధార: నక్కవానిపాలెంలోని శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు రామారావుశర్మ, ఉమామహేశ్‌ల పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె, బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి వివేకానంద కల్యాణ మండపంలో నిర్వహించిన అన్న సమారాధనలో పాల్గొని, భక్తులకు ఆమె అన్నప్రసాదం వడ్డించారు. జ్వాలా తోరణం ఉత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో బర్ల బాలకృష్ణ, నక్క అప్పారావురెడ్డి, గుప్తాజీ, శ్రీహరి సేవకులు ,గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వరాలయంలో..

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. సాయంత్రం 6.30గంటలకు ఆకాశ దీపారాధన నిర్వహించారు.

అర్ధ నారీశ్వరుడిగా ..

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో ఉమా రామలింగేశ్వరస్వామిని అర్ధ నారీశ్వరుడిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

వైభవుని సన్నిధిలో ప్రత్యేక పూజలు



వైభవుని సన్నిధిలో హనుమాన్ చాలీసా పఠిస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శేషాచార్యులు, వాసుదేవాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం 6.30గంటలకు ఆర్జిత సేవ నిర్వహించారు. అనంతరం స్వామికి పంచామృతాలతో, ఫల రసాలతో అభిషేకాలు చేశారు. వైభవుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వైభవుడి సన్నిధిలో మహిళలు సామూహిక హనుమాన్ చాలీసా పఠించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గంజాయి పట్టివేత

- రామాటాకీస్ వద్ద ఎక్సైజ్ అధికారుల తనిఖీలు
- 7 కేజీల డ్రై గంజాయి గుర్తింపు.. ఇద్దరి అరెస్ట్



గంజాయి నిందితులతో ఎక్సైజ్ అధికారులు

విశాఖ సిటీ: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సి.హెచ్.వి.మహేష్ కుమార్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సిబ్బంది నగరంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో రామాటాకీస్ ప్రాంతంలోని అన్నా క్యాంటీన్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరి వద్ద రెండు ప్యాకెట్లతో ఏడు కేజీల డ్రై గంజాయిని గుర్తించారు. ఈ కేసులో కేరళకు చెందిన వి.కె.అభిషేక్, ఎం.ఎం .సచిన్‌లను అరెస్టు చేసి తదుపరి విచారణ కోసం సీతమ్మధార ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. గంజాయిని సీజ్ చేశారు. ఇన్‌స్పెక్టర్లు సి.హెచ్.రాజేశ్వరి, ఎస్.శ్రీనివాస్, ఎస్ఐలు ఎల్.అరుణకుమారి, పి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.